



కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం వాటర్ ఫాల్స్ వద్ద గండిపడి పొలాల్లోకి చేరుతున్న వరద నీరు

ఏలేరు.. వరదేరు

- మహోగ్రరూపం దాల్చిన ఏలేరు
- నాలుగేళ్ల తర్వాత రిజర్వాయరుకు అంచనాలకు మించి వరద
- గంటగంటకు ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద ఉధృతి
- ఇన్‌ఫ్లో 27,275 వేల క్యూసెక్కులు
- ప్రాజెక్టు నిండిపోవడంతో దిగువకు కాలువల్లో 27,275 వేల క్యూసెక్కులు విడుదల
- కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడు మండలాల్లో కాలువలకు భారీ గండ్లు
- కిర్లంపూడిలోని రాజుపాలెంలో గండిపడటంతో నాలుగు గ్రామాలను ముంచెత్తిన వరద
- పెద్దాపురంలో కొట్టుకుపోయిన దబ్బ కాల్వ వంతెన.. ఏలేశ్వరంలో కుంగిన అప్పనపాలెం వంతెన
- ఏలేరు వరదతో 22 వేల ఎకరాల్లోకిపైగా మునిగిన వరి, ఇతర వాణిజ్య పంటలు
- గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో ఏకంగా జాతీయ రహదారిపైకి వచ్చేసిన వరద నీరు
- మరోపక్క జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో కొన్ని రహదారులపైకి పది అడుగుల ఎత్తులో నీరు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏలేరు రిజర్వాయరుకు గంటగంటకూ అంచనాలకు అందనంత రీతిలో వరద పోటెత్తుతోంది. ఎగువన క్యాచ్‌మెంట్ ఏరియా అయిన ఏజెన్సీలో వర్షాలు భారీగా కురుస్తుండడంతో వేల క్యూసెక్కుల వరద రిజర్వాయరును ముంచెత్తుతోంది. గంటగంటకు ప్రవాహ ఉధృతి పెరిగిపోతోంది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం అయిన 24.11 టీఎంసీలకుగాను రాత్రి 11 గంటలకు 23.25 టీఎంసీల నీరొచ్చిచేరింది. దీంతో ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. అదే సమయంలో ఇంకా ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 27,275 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. అంతకు ముందు 8 గంటలకు 46,625 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి చేరింది. ఇందులో సోమవారం సాయంత్రానికి 27,000 క్యూసెక్కుల వరదను కాల్వల్లోకి, విశాఖకు 275 క్యూసెక్కులను వదులుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే గడచిన నాలుగున్నరేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ స్థాయిలో వరద ఏలేరును చుట్టుముడుతోంది. గతంలో 2013, 2019, 2020ల్లో ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కుల నుంచి 48 వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చింది. ఇప్పుడు ఆ స్థాయికి మించి వరద పోటెత్తుతుండంతో దిగువకు వరద నీటిని వదిలేస్తున్నారు. అయితే ఊహించని వరద కాలువలను ముంచేస్తుండడంతో ఎక్కడికక్కడ కాలువలకు భారీగా గండ్లు పడుతున్నాయి. సోమవారం ఒక్కరోజే వరద తీవ్రతకు పదిచోట్లకుపైగా గండ్లు పడ్డాయి. ముఖ్యంగా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఏలేరు కాలువకు అత్యంత భారీగా గండిపడింది. దీంతో రాజుపాలెం, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. అనేక ఇళ్లల్లోకి వరద వచ్చేసింది. మండలంలో మొత్తం ఆరువేలకుపైగా ఎకరాల్లో వరి నీటమునిగింది. పెద్దాపురం మండలంలో దబ్బ కాల్వ వంతెన అయితే వరద తీవ్ర తకు కొట్టుకుపోయింది. దీంతో వందలాది ఎకరాలు మునిగిపోయాయి. ఏలేశ్వరంలో అయితే అప్పన్నపాలెం వంతెన కుంగి పోవడంతో వరద నీరు పైనుంచి ప్రవహిస్తోంది. అటు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం వద్ద ఏలేరు ఎడమ కాలువకు గండిపడింది. దీంతో సమీప పంట పొలాలను వరద ముంచేసింది. మరోపక్క వరద తీవ్రత అధికంగా గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో అధికంగా ఉంది. ఈ రెండు మండలాల్లో భోగాపురం, రాపర్తి, పిడింరొడ్డి సమీపంలో ఈ గండ్లు భారీగా పడ్డాయి. దీంతో పిఠాపురం నియోజ కవర్గంలో 10 వేల ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలైతే వరద తీవ్రతకు కొట్టుకుపోయాయి. అలాగే వరద తీవ్రత పెరగడంతో 216వ జాతీయ రహదా రిపై గొల్లప్రోలు టోల్‌గేట్‌కు అటు ఇటు రెండుచోట్ల వరద నీరు వచ్చేసింది. గొల్లప్రోలులో పేదల ఇళ్లకాలనీ రహ దారిపైకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. ఈ నేపథ్యంలో గొల్లప్రోలు మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠా పురం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి సోమవారం సాయంత్రం పర్యటించారు. తొలుత పవన్ గొల్లప్రోలులోని తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలో పవన్‌కల్యాణ్ సమీక్ష ఉన్నందున కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన సమీక్షను రద్దుచేసుకుని సాయంత్రం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి అమరావతి వెళ్లారు.



రాజుపాలెంలో గండి పడడంతో పొలాలను ముంచెత్తుతున్న వరద

రాకపోకలు బంద్.

వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం రాత్రి వరకు అనేకచోట్ల భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలుచోట్ల రహదారులపైకి వరద నీరు భారీగా ప్రవహించింది. దీంతో ప్రత్తిపాడులో పలు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తుని-నర్సీపట్నం మధ్య వరద నీరు పొంగడంతో ఆర్టీసీ సర్వీసులను నిలిపివేశారు. ప్రైవేటు వాహనాలూ లేక జనం ఇబ్బందులు పడ్డారు.

మీకు నేనున్నా..

బురదలో తిరుగుతూ.. జనం కష్టాలు వింటూ.. సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్



బురదలో నడుస్తున్న పవన్.. బురదలోనే బాలుడితో మాట్లాడుతూ..

ఏలేరు ఉప్పొంగింది.. గ్రామాలను ముంచెత్తింది.. ఎటు చూసినా నీరే.. అడుగు తీసి అడుగు వేయలేం.. సామాన్యులైనా వెళ్లడం కష్టమే.. అటువంటిది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అడుగేశారు.. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు మడుగులా ఉన్న బురదలో దిగారు.. సమస్యలు విన్నారు.. మీకు నేనున్నానంటూ భరోసాగా నిలిచారు. కాకినాడ జిల్లాలో ఏలేరు వరదేరుగా మారింది. నాలుగేళ్ల తర్వాత ఉగ్రరూపం దాల్చింది. సోమవారం ఒక్కరోజే ఆ జిల్లాలోని ఏడు మండలాల్లో 22 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. ఇళ్లనూ చుట్టేసింది. సోమవారం అర్ధరాత్రి గొల్లప్రోలు టోల్‌గేట్‌కు ముందు, వెనుక వరద నీరు హైవేపైకి వచ్చేసింది. ఈ మేరకు సమా చారం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటా హుటిన గొల్లప్రోలులో వరద ప్రాంతాలకు చేరుకు న్నారు. బురదలోనే నడుచుకుంటూ, బోటు ఎక్కి నీటముని గిన పేదల ఇళ్ల కాలనీకి వెళ్లారు.ఆదుకుంటామని బాధితుల కు భరోసా ఇచ్చారు. మరో పక్క వర్షాలతో అనేకచోట్ల రహదారులపై పదడు గుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండడం తో రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం రోడ్డులో ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసింది.

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: ఏలేరు రిజర్వాయర్ కన్నెర్ర జేసింది. కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లో వరద ముంచెత్తింది. పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావంతో కొన్ని కాలనీలు నీటమునగగా, వేలాది ఎకరాల్లో పంట వరద పాలైంది. ఈమేరకు సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చి అక్కడ నుంచి నేరుగా గొల్లప్రోలు జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి బోటులో జగనన్న కాలనీ సందర్శనకు బయలుదేరారు. సుద్దగడ్డ వరద ముంపు బారినపడిన గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీలో విస్తృతంగా పర్యటించారు. బోటులో వెళ్లి వరదనీటిలో, బురద మయంగా మారిన రహదారుల్లో నడుస్తూ జగనన్న కాలనీ వాసులను పలకరించి వారి కష్టాలను తీరుస్తానని భరోసా ఇచ్చారు. కాలనీవాసులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. జగనన్న కాలనీకి వచ్చిన తర్వాత అష్టకష్టాలుపడుతున్నామని,కనీసం తాగునీరు అందడం లేదని, రోడ్లు, డ్రెయిన్లు లేవని, తమ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్‌కు మొరపెట్టుకున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, బ్రిడ్జి నిర్మించాలని, తాటిపర్తి రోడ్డుకు అనుసంధానంగా రోడ్డు నిర్మించాలని విన్నవించారు. అందరి కష్టాలు విని మీకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.

ఆరోగ్యం బాగాలేకున్నా వచ్చా : పవన్

మెట్టలో ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వరద ముంపు తగ్గగానే ఆ దిశగా కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్యం సహకరించకున్నా వరద పరిస్థితిని సమీక్షించేందుకు తాను స్వయంగా వచ్చినట్టు తెలిపారు. జగనన్న కాలనీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు బలైపోయారన్నారు. వరద ప్రాంతాల సందర్శన అనంతరం పవన్ అత్యవసర సమీక్ష కోసం మంగళగిరి వెళ్లారు.



నీట మునిగిన ప్రాంతాలకు బోటులో వెళుతున్న పవన్



అధికారులకు పవన్ సూచనలు



గొల్లప్రోలు జగనన్న కాలనీలో సమస్యలు వింటున్న పవన్, వర్మ

గొల్లప్రోలు- పిఠాపురం మధ్య కాల్వలకు గండ్లు పడడంతో పొలాల్లోకి ప్రవహిస్తున్న నీరు



గొల్లప్రోలు సూరంపేటకు బోటుల్లో వెళ్తున్న జనం



పొలాలను ముంచెత్తిన ఏలేరు వరద

కాలువలకు పలుచోట్ల గండ్లు

గట్లపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

జలాశయాలను తలపిస్తున్న చేలు

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు9: ఏలేరు వరద పంట పొలాలను ముంచెత్తింది. ఏలేరు రిజర్వాయర్ నుంచి 27వేలకుపైగా క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలతోపాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏలేరు కాలువల్లో వరద నీరు గట్లపై నుంచి ప్రవహిస్తున్నాయి. గొల్లప్రోలు-పిఠాపురం మధ్య గల పిడింరొడ్డి సమీపంలో ఏలేరు కాలువకు రెండుచోట్ల, రాపర్తి వద్ద గొర్రిఖండికి, భోగాపురం వద్ద పులిదొడ్డి సమీపంలో, జిరాయితీ దొడ్డి ప్రాంతంలో కాలువలకు గండ్లు పడ్డాయి. గట్లపై నుంచి నీరు ప్రవహించడంతో గొల్లప్రోలు, లక్ష్మీపురం, సీతానగరం, మల్లవరం, చెందుర్తి గ్రామాలతోపాటు పిఠాపురం పట్టణ శివారు ఇల్లింద్రాడ, మండలంలోని బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం, మాధవపురం, నవఖండ్రవాడ గ్రామాల్లో వేల ఎకరాల్లో వరిపంటతోపాటు పత్తి, కాయగూరలు తదితర పంటలు నీట మునిగాయి. గొల్లప్రోలు-పిఠాపురం మధ్య 216వ జాతీయ రహదారిని చేర్చి ఉన్న పంటపొలాలు జలాశయాలను తలపిస్తున్నాయి. గొల్లప్రోలు కాలువపై ఉన్న ఫుట్‌పాత్ బ్రిడ్జికి సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. అలాగే జాతీయ రహదారిపైకి ఏలేరు వరద నీరు చేరింది. గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో ఏలేరు కాలువకు గండిపడడంతో పంటపొలాలు మీదుగా వరద నీరు ప్రవహించి మళ్లీ కాలువలోకి చేరుతోంది. అటు చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో 216వ జాతీయ రహదారిపైకి వర్షపునీరు చేరింది. ఒకవైపు నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు సుద్దగడ్డ వరద ఉధృతమైంది. ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీటితో సుద్దగడ్డ(కొండ)కాలువ గట్టుకు సమాంతరంగా ప్రవహిస్తోంది. దీంతో గొల్లప్రోలు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై ఐదున్నర అడుగుల ఎత్తున వరద నీరు చేరింది. సూరంపేట జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో వీరికి నాలుగు బోట్లు ఏర్పాటుచేశారు.





భూపాలపట్నంలో ముంపునకు గురైన ఊరు

ఏలేశ్వరంలో వరద ప్రవాహానికి కుంగిన వంతెన

ఏలేశ్వరం, సెప్టెంబరు 9: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో అప్పనపాలెం వంతెన భారీ వరదకు కుంగింది. భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్ నుంచి అధిక మొత్తంలో నీటిని విడుదల చేయడంతో వంతెన పైభాగం నుంచి నీరు ప్రహహించడంతో కాజ్‌వే పూర్తిగా కుంగింది. పట్టణం నుంచి అప్పనపాలెం ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. జేసీ రాహుల్‌మీనా, తహశీల్దార్ వెంకటేశ్వరరావు సోమవారం వంతెనను పరిశీలించారు.

కిర్లంపూడి మండలంలో ఆందోళనకరం

- రాజుపాలెం, భూపాలపట్నంలో ఏలేరు కాల్వకు గండి
- 8 గ్రామాల్లోకి వరద నీరు.. పొంచి ఉన్న ముప్పు
- నాలుగు వేల ఎకరాల్లో పంట మునక
- బాధితులను పునరావాసాలకు తరలిస్తున్న అధికారులు

కిర్లంపూడి, సెప్టెంబరు 9: ఏలేరు ఉధృతితో కిర్లంపూడిలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మండలంలోని రాజుపాలెం, భూపాలపట్నం గ్రామాల్లో ఏలేరు కాల్వకు గండి పడడంతో 8 గ్రామాల్లోకి వరదనీరు చేరడంతో ముప్పు పొంచి ఉంది. నాలుగువేల ఎకరాల్లో పంట ముంపుకు గురికావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలతో జలాశయాల వరద గేట్లు ఎత్తివేయడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజుపాలెంలో కాలువ గండిపడడంతో 300 ఎకరాలకుపైగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. భూపాలపట్నం, తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో కాలువ గండ్లు కొట్టడంతో ఆయా గ్రామాలు ముంపునకు గురై రాకపోకలు స్తంభించాయి. ఎస్సీపేట ముంపునకు గురైంది. వరద ప్రభావంతో రాజుపాలెం, ముక్కోలు, భూపాలపట్నం, శృంగనాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, గెద్దనాపల్లి, వేలంక, సోమరాయణంపేట, పాలెం గ్రామాల్లో నీరు చేరడంతో అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొంతమందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు పర్యవేక్షణలో ప్రజలకు ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. గండికొట్టిన ప్రాంతాన్ని జేసీ రాహుల్ మీనాతోపాటు ఇరిగేషన్ సీఈ పుల్లారావు, ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ జి.శేషగిరిరావు, జేఈ శ్రీనివాసకుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ చౌదరి, జేఈ అప్పలరాజు కూడా పరిశీలించారు.

ఏలేరు వరదపై అప్రమత్తంగా వ్యవహరించాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 9: భారీ వర్షాలు, తుఫాను హెచ్చరిక నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీటి ప్రవాహానికి కాలువలకు ఎక్కడా గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న గట్లను ముందుగానే అధికారులు గుర్తించాలన్నారు. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రానున్న 24గంటలు అత్యంత కీలకమన్నారు. బోట్లు, గజఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు మూసివేయాలని జిల్లా పాఠశాల, విద్యాశాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి భరణి, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలకు ప్రభుత్వ సాయం

ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం

జిల్లాలో 5 వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 9: జిల్లాలో వరదల వల్ల ముంపులో ఉన్న గ్రామాలకు ప్రభుత్వం సాయం అందిస్తోంది. జిల్లా పౌరసరఫరాశాఖ ద్వారా నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 5 వేల కుటుంబాలకు సరుకులు అందజేయాలని నిర్ణయించారు. వరద ముంపులో ఉన్న కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి ఉచితంగా 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, లీటరు పామాయిల్ అందజేస్తున్నారు. ఈమేరకు సర్వం సిద్ధంచేశారు. జిల్లాలో గొల్లప్రోలు, కిర్లంపూడి, ఏలేశ్వరం, పెద్దాపురం, రౌతులపూడి, కోటనందూరు, యూ.కొత్తపల్లి, తొండంగి, పిఠాపురం, సామర్లకోట మండలాల్లోని పలు గ్రామాలు ముంపులో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఎక్కడైతే అత్యధిక ముంపులో ఉండి జనం ఇబ్బందులు పడుతున్నారో వారిని గుర్తించి నిత్యావసర సరుకులు పంపిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి ఎంవీ ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే గొల్లప్రోలు మండలం సూరడపేటలో 600 కుటుంబాలకు వీటిని పంపించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముంపు గ్రామాలకు నిత్యావసర సరుకులు పంపిస్తున్నామని ఆయన తెలియజేశారు.

తాండవ రిజర్వాయర్‌లో నీటి విడుదల



కోటనందూరు/తుని రూరల్, సెప్టెంబరు 9: తుఫాను ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోంది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా ప్రస్తుతం 379.6 అడుగులకు చేరింది. ఎగువప్రాంతం నుంచి 8900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రావడంతో, దానికి అనువుగా 8931 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తాండవ డీఈ అనురాధ తెలిపారు. కాగా ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులతో మాట్లాడి నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. తుని పట్టణంలో రెల్లి కాలనీ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కొట్రాళ్లకొండ వద్ద కూడా నది ఉధృతంగా ఉంది.

వరదతో నిండిన సుబ్బారెడ్డి సాగర్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం గ్రామం వద్ద మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు భారీ వర్షాలకు పూర్తిగా నిండిపోయింది. సాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో సోమవారం ఈ ప్రాజెక్టు గరిష్ఠ స్థాయి నీటిమట్టం 87 మీటర్ల మించి 87.30కు చేరుకుంది. దీంతో అధికారులు 1000 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. ఈ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1000 క్యూసెక్కులు ఉందని ఇరిగేషన్ అధికారి ఇబ్రహీం తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పొర్లు కట్టడం మీదుగా వరద నీరు బయటకు తరలివెళ్తోంది.





విశేష అలంకరణలో విఘ్నేశ్వర స్వామి

సిద్ధి వినాయక స్వామికి పంచ హారతులు

అయినవిల్లి, సెప్టెంబరు 9: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వర స్వామికి పంచ హారతులు ఇవ్వగా భక్తులు తిలకించి తన్మయులయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్య నిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సేవలు అందించారు.

వీఆర్‌కు రామచంద్రపురం ఎస్ఐ వాసు!



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్ఐ పి.వాసును ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వీఆర్‌కు పంపినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెదపూడి, బిక్కవోలు ఎస్ఐగా పనిచేసిన కాలంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పలు ఇబ్బందులకు గురిచేసినట్టు వాసుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను రామచంద్రపురం ఎస్ఐగా నియమించడంపై రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ఎస్ఐ వాసును ఎస్పీ వీఆర్‌కు పిలిచినట్టు తెలిసింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

రాజానగరం, సెప్టెంబరు 9: నిరుద్యోగులైన యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ఉచిత శిక్షణ ఇస్తామని రాజానగరం సెర్ప్ ఏపీఎం కర్రి హేమనాగలక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేర్, సర్వీస్‌తో పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెక్యూరిటీ కెమెరా సర్వీస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బుధవారం ప్రారంభమై నెల పాటు సాగే శిక్షణలో భోజన, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్, బ్యాంకు లోన్ సహాయం అందిస్తారని చెప్పారు. పదో తరగతి పాస్/ఫెయిల్/ఆపైన విద్యార్హతలతో 18నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద శిక్షణా తరగతులు నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 77805 99939, 96523 04150 నెంబర్లలో సంప్రదించాలని ఏపీఎం కోరారు.



అటవీ శాఖ అధికారులు అమర్చిన ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులి

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే

చిరుత పులి

తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 9: చిరుత పులి దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలోనే ఉన్నట్టు ట్రాప్ కెమెరాలో గుర్తించామని తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. సోమవారం కూడా ఈ ప్రాంతంలోనే చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరుత పులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకు, పశువులకు ఎటువంటి హాని, ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఆదివారం మాదిరిగానే చిరుత పులిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారాన్ని బట్టి ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని డీఎఫ్‌వో వివరించారు.



వై.రామవరం-యార్లగడ్డ రహదారి మధ్య వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కొండవాగులు పొంగిపొర్లాయ్!

వై.రామవరం, సెప్టెంబరు 9: మండలంలోని బందిగడ్డ-సింగవరం మధ్య, యార్లగడ్డ-వై.రామవరం మధ్య, పెద ఊలెంపాడు, దాలిపాడు, గుర్తేడు వరకు ఉన్న కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనులకు రాపోకలు పూర్తిగా స్తంభించాయి. చిన ఊలెంపాడు గ్రామంలోని ఒక వాగు వద్ద రెండు ఆవులు కొట్టుకుపోయినట్టు సమాచారం. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తత చర్యలు చేపట్టారు. ఎంపీడీవో బాపన్నదొర, ఎస్ఐ సంతోష్‌కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది వాగుల వద్ద ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులకు అవతల, ఇవతల వైపు ఉన్న ప్రజలు, ఉద్యోగులు సైతం ఎక్కడి వారు అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సీలేరు నది ఉగ్రరూపం



మోతుగూడెం, సెప్టెంబరు 9: మోతుగూడెంలో ఆదివారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంతో డొంకరాయి రిజర్వాయర్ గేట్లు ఎత్తేయడంతో సీలేరు నదికి వరద ఉధృతి ఎక్కువైంది. ఆ నీరు మోతుగూడెం రహదారులపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మోతుగూడెం, కొల్లూరు రహదారి జలమయం అవడంతో రాకపోకలు నిలిచిపోయి పొల్లూరు పవర్ హౌస్‌కు వెళ్లే ఉద్యోగస్తులు అవస్థలు పడ్డారు.



లబ్బర్తి-అనంతగిరి మధ్య కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఉధృతంగా వాగులు... స్తంభించిన రాకపోకలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 9: మండలంలో ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి, రాజవొమ్మంగి-శాంతినగర్, మొల్లిమెట్ల-లాగరాయి, వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామల మధ్య రోడ్లపై ఉన్న కాజ్‌వేలపై కొండ వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తహసీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, సీఐ సన్యాసినాయుడు వాగులను పరిశీలించారు. వాగుల వద్ద సిబ్బందిని పహారా పెట్టినట్టు అధికారులు తెలిపారు.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

భారీ వర్షాల కారణంగా నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహించింది. సోమవారం సాయంత్రం తగ్గుముఖం పట్టిన తర్వాత కాజ్‌వే సమీపంలో కొట్టుకుపోయిన రహదారి బయటపడింది. వరద ఉధృతి తగ్గిన వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు కోరారు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

మళ్లీ ఉధృతం

కాటన్ బ్యారేజీ నుంచి 3.72 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 9: ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఇంద్రావతి, తాలిపేరు నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. కుంట వద్ద శబరి నుంచి వస్తున్న వరద నీరు కలుస్తుండడంతో గోదావరి ఉరకలెత్తుతోంది. సోమవారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద 25.30 అడుగులకు తగ్గిన నీటి మట్టం ఎగువ నుంచి ప్రవాహంతో సాయంత్రం ఆరు గంటలకు 29.60 అడుగులకు చేరు కుంది. ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న నీటిమట్టం సోమవారం మధ్యాహ్నానికి ఏడు అడుగులకు చేరుకోగా సాయంత్రం ఆరు గంటలకు నిలకడగా ఉంది. 3,72,932 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో విజయవాడ-జగదల్‌పూర్ నడుమ ఉన్న ఎర్రబోరు గ్రామం వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిని ముంచెత్తిన వరద నీరు

చింతూరును చుట్టుముట్టిన వరద

జలదిగ్బంధంలో మండలంలోని 22 గ్రామాలు

చింతూరు, సెప్టెంబరు 9: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం ధాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు ఒక్కసారిగా నిండిపోయాయి. చింతూరు మండలంలోని డొంకరాయి రిజర్వాయరు నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రభావం చింతూరు మండలంపై పడింది. ఒక్కసారిగా వచ్చిపడిన వరద గ్రామాలను చుట్టుముట్టింది. వరద నీరు రహదారులపై వడిగా ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం గంటల వ్యవధిలోనే పెరిగి సోమవారం రాత్రికి 41 అడుగులకు చేరింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా శబరి పరవళ్లు తొక్కుతోంది. భద్రాచలం వద్ద 30 అడుగులకు చేరువలో గోదావరి ప్రవహిస్తోంది. గర్భిణులను నాటు పడవలపై చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. 22 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆంధ్ర-ఒడిశా నడుమ 326వ జాతీయ రహదారిపై చింతూరు మండలం నిమ్మలగూడెం, కుయుగూరు నడుమ వరద నీరు చేరింది. ఇక ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నడుమ సుక్మా జిల్లా ఎర్రబోరు వద్ద 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరింది. రాకపోకలు నిలిచిపోయాయి.



కల్లేరుకు చెందిన గర్భిణులను నాటు పడవలపై తరలిస్తున్న జాలర్లు

పరిమళించిన మానవత్వం

గోకవరం, సెప్టెంబరు 9: మనుషుల్లో మానవత్వానికి కొదవలేదని చెప్పేందుకు గోకవరంలో చోటుసుకున్న ఈ ఘటనే ఉదాహరణ. తూర్పు గోదావరి జిల్లా గోకవరం ప్రభుత్వాసుపత్రి వద్ద వృద్ధ దివ్యాంగుడు (రెండు కాళ్లు పనిచేయవు) కొద్ది రోజులుగా కడు దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరైనా దయతలిచి పెడితే కడుపు నింపుకుంటున్నాడు. లేకుంటే పస్తులుంటున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూడా ఆసుపత్రి బయటే ఓ పక్క తడుస్తూ మరో పక్క మూలుగుతూ ఒక ప్లాస్టిక్ కవరు కప్పుకుని బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఆ వృద్ధుడి నిస్సహాయ స్థితి స్థానికుల ద్వారా పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు చేరింది. దీంతో ఆయన హుటాహుటిన సిబ్బందిని ఆసుపత్రి వద్దకు పంపించి వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టారు. ఎటువంటి ఆహార లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ఆ ముసలాయన తన సొంతూరు విశాఖపట్టణం అని చెప్తున్నాడు. వృద్ధుడి విషయంలో పంచాయతీ కార్యదర్శి చూపిన ఆదరణను పలువురు అభినందించారు.



వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి వర్షపు నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 9: తుఫాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాలకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో అవి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. జెన్‌కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి, గుంటవాడ జలాశయాల నుంచి భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా డొంకరాయి జలాశయానికి వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి లక్షా పదివేల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్నాయి. జలాశయంలో 1,037 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపడుతూ ఏడు గేట్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయానికి పిల్లిగెడ్డ వాగు నుంచి 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతుండటంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు 23వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,360 అడుగులు కాగా, 1359 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు



కుండపోత వర్షానికి పొల్లూరు జల విద్యుత్ కేంద్రం కొండపైనుంచి వర్షపు నీరు కేబుల్ ట్రెంచ్‌ల ద్వారా టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవహించింది. జల విద్యుత్ కేంద్రం వెనుక భాగంలో ఉన్న డీవాటరింగ్ పంప్ షెడ్ కూడా నీటిలో మునిగిపోయి సమస్య తలెత్తింది. జెన్‌కో అధికారులు అప్రమత్తమై టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవేశించిన వర్షపు నీటికి అదనపు మోటార్లను అమర్చి జల విద్యుత్ కేంద్రానికి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోకి నీరు ప్రవేశించడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయగా ఉదయం 9 గంటల తర్వాత రెండు యూనిట్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.

పూర్తిస్థాయికి చేరువులో బలిమెల జలాశయం

సీలేరు కాంప్లెక్సులో అత్యంత పెద్దదైనది బలిమెల జలాశయం, దీని పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు కాగా ప్రస్తుతం 1510 అడుగులకు చేరింది. మరో ఐదు అడుగుల నీటిమట్టం పెరిగితే బలిమెల జలాశయం నుంచి గుంటవాడ జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గుంటవాడ జలాశయం నీటిమట్టం తగ్గించేలా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి

తొమ్మిదేళ్ల జైలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9: మానసిక వైకల్యం గల మహిళను 2016లో అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి తొమ్మిదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన మానసిక వైకల్యం ఉన్న మహిళ సమీపంలో ఉన్న తోట మణికంఠ ఇంటికి ఏకాదశి పూజల నిమిత్తం వెళ్లింది. అదే గ్రామానికి చెందిన పెయ్యల వీరబాబు తన కూతురిపై అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడని మహిళ తండ్రి అప్పట్లో ఫిర్యాదు చేశాడు. పెయ్యల వీరబాబు, తోట మణికంఠలపై అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సీఐ అప్పారావు ఇద్దరిని అరెస్టు చేశారు. సుదీర్ఘమైన వాదనల అనంతరం పెయ్యల వీరబాబుకు తొమ్మిదేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారు.



ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

నాలుగు నెలల పాటు ప్రయాణికుల సేవలో...

సామర్లకోట, సెప్టెంబరు 9: రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, పండుగ రోజుల్లో వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు సోమవారం నుంచి వివిధ ప్రాంతాలకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సికింద్రాబాద్-విశాఖ (07097) డిసెంబరు 1 వరకు, విశాఖ-సికింద్రాబాద్ (07098) డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

సికింద్రాబాద్‌లో రాత్రి 8.35 గంటలకు బయల్దేరి నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా తెల్లవారుజామున 5.10 గంటలకు రాజమహేంద్రవరం, 5.43 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ మీదుగా విశాఖపట్టణం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో విశాఖలో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి మీదుగా రాత్రి 9.36 గంటలకు అన్నవరం, రాత్రి 10.05 గంటలకు సామర్లకోట, 10.45 గంటలకు రాజమహేంద్రవరం అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్ ఉదయం 11.15 గంటలకు చేరుతుంది.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07440) అక్టోబరు 10 నుంచి డిసెంబరు 1 వరకు, గల శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07440), అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు రాకపోకలు సాగిస్తాయి.

తిరుపతిలో సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 2.02 గంటలకు రాజమహేంద్రవరం, 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని, అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా అర్ధరాత్రి 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్‌లో సాయంత్రం మూడు గంటలకు బయల్దేరి పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.00 గంటలకు తుని, రాత్రి 8.58 గంటలకు సామర్లకోట, రాత్రి 9.45 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుతుంది.

నాందేడ్-బెరహమ్‌పూర్ (07431) అక్టోబరు 12 నుంచి నవంబరు 30 వరకు, బెరహమ్‌పూర్-నాందేడ్ (07432) అక్టోబరు 13 నుంచి డిసెంబరు 1 వరకు రాకపోకలు సాగిస్తాయి.

నాందేడ్‌లో సాయంత్రం 3.25 గంటలకు బయల్దేరి ముద్‌ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు మీదుగా తెల్లవారుజామున 3.48 గంటలకు రాజమహేంద్రవరం, 5.38 గంటలకు సామర్లకోట, అక్కడి నుంచి అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా 2.45 గంటలకు బెరహమ్‌పూర్ చేరుతుంది.

తిరుగు ప్రయాణంలో బెరహమ్‌పూర్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపాడ, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం మీదుగా రాత్రి 11.30 గంటలకు సామర్లకోట, అర్ధరాత్రి 12.35 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముద్‌ఖేడ్ మీదుగా సాయంత్రం 3.45 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

క్రేన్ రాడ్ జారి పడి యువకుడి మృతి



రామకృష్ణ గణేష్ (పాతచిత్రం)

నిడదవోలు, సెప్టెంబరు 9: క్రేన్ ముందు భాగంలో ఉన్న రాడ్ జారిపడి లారీ యజమాని మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రు ర్యాంపులో ఇసుక లోడుతో ఉన్న భారీ లారీ బోల్తా పడింది. దానిని రెండు భారీ క్రేన్ల సహాయంతో పైకి లేపుతుండగా క్రేన్ ముందు భాగంలో ఉండే రాడ్‌లారీ బరువుకి ఒక పక్కకి ఒరిగిపోయి లారీ యజమాని అత్తిలి తారక రామకృష్ణ గణేష్ (28)పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని స్థానికులు నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం తరలించగా మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి



చిట్టిబాబు (పాతచిత్రం)

తాళ్లరేవు, సెప్టెంబరు 9: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపి చిట్టిబాబు (50) సోమవారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్టు కోరంగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆత్రేయ గోదావరి మేకల కాలువలో చేపలవేటకు వెళ్లిన చిట్టిబాబు వరిసి వల వేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయాడు. గట్టుమీద ఉన్న దుస్తులు, బకెట్టు చూసిన స్థానికులు కాలువలోకి దిగి వెతకగా చిట్టిబాబు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని కోరింగ పోలీసులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వినాయకుడి పూజల్లో పవన్‌కల్యాణ్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 9: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసంలోని నిలిపిన వినాయకుడి పూజల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. వినాయకుడికి పూజలు చేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ నగిలి షాన్‌మోహన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టరు కృష్ణతేజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని ఆదేశించారు.

ఉధృతంగా కాల్వలు

- ఏలేరు రిజర్వాయర్ నుంచి దిగువకు వరద నీటి విడుదలతో పొంచి ఉన్న ముప్పు
- ఉప్పొంగుతున్న సుద్దగడ్డ కాలువ
- ప్రత్తిపాడులో సుబ్బారెడ్డిసాగర్ ఏటి కాలువ
- పెద్దాపురం మండలం కాండ్రకోటలో దబ్బకాలువపై కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన
- సామర్లకోట మండలం వీకే రాయపురం ఏటిగట్టుకు వద్ద ప్రమాదకర పరిస్థితి



చెక్కు అందజేస్తున్న యనమల, ఎమ్మెల్యే నానాజీ, జనసేన నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం : యనమల

తునిరూరల్, సెప్టెంబరు 9: గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. వరద పీడిత గ్రామ పంచాయతీలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సొంత నిధుల నుంచి లక్ష రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమం తునిలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా యనమల మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను పూర్తిగా సర్వనాశనం చేశారని, వాటిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. పవన్ ఇచ్చే నిధులు క్షేత్రస్థాయిలో పూర్తిగా సఫలీకృతం అవ్వాలని అందుకనుగుణంగా నాయకులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన నాయకులు తుమ్మల బాబు, తోట నగేష్, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, ఇనిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్ ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 9: ఏలేరు వరద నీటి ప్రభావంతో ముంపు బారిన పడే లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యల అమలు, ఏర్పాట్లపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం తిమ్మాపురం శివారు అవంతి నగర్, కాలనీ, పి. వెంకటాపురం, పండూరు, సర్పవరం, ఎస్ అచ్యుతాపురం శివారు జనచైతన్య కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలు వరద ముంపుబారిన పడే ప్రమాదం ఉందన్నారు. వరద ముంపుపై ప్రజలను అప్రమత్తం చేయాలని, సురక్షిత ప్రదేశాలు, పునరావాస శిబిరాలకు తరలించేందుకు రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. పంట కాలువ, గాడేరు కాలువల్లో పూడికతీత ఉంటే తక్షణమే తొలగింపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, కటకంశెట్టి బాబీ, చోడిశెట్టి ఇంద్ర పాల్గొన్నారు.

'దాడులను సమైక్యంగా తిప్పికొట్టాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 9: సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను సమైక్యంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధన సమితి ఆవిర్భావ సభ స్థానిక యూటీఎఫ్ హోంలో జరిగింది. ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ, దళిత సంఘాల నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, దడాల సుబ్బారావు ముఖ్యఅతిధులుగా హాజరై మాట్లాడారు. ప్రముఖ వైద్యులు భానుమతి, ఆనంద్, వెంకటరావు, సమితి నాయకులు డాక్టర్ పవన్‌కుమార్, విప్పర్తి సోమశేఖర్, పిల్లి రామారావు, టి నూకరాజు, న్యాయవాది మహమ్మద్ బషీర్ పాల్గొన్నారు.

'వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 9: రాష్ట్రంలో గత 2 వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, కాలువలు పట్టణాలు, గ్రామాలను ముంచేస్తున్న వరదలను కేంద్రప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం రామవరం శివారు రంగవల్లి నగర్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. తెలంగాణలో తెచ్చిన హైడ్రా చట్టాన్ని ఏపీలో కూడా తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కె.సతీష్, డాన్ శ్రీను, దేవి తదితరులు పాల్గొన్నారు.

'ముంపు రైతులను ఆదుకోవాలి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: భారీ వర్షాలు, వరదలకు ముంపు బారినపడిన ప్రత్తిపాడు మండల రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కోరారు. సోమవారం పీసీసీ సభ్యుడు శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల బృందం మండలంలోని ఒమ్మంగి, లంపకలోవ, రాచపల్లి, ప్రత్తిపాడు గ్రామాల్లోని ముంపుబారిన పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. మండలంలో కుళ్లిపోయిన వరి చేలకు అధికారులు పంట నమోదు చేపట్టి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు వీర గణేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 9: కాకినాడ రూరల్ సర్పవరం ది కాకినాడ ఆటోనగర్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గరగ సత్తిబాబు ఆధ్వర్యంలో సుమారు రూ.1 లక్ష విలువచేసే బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను విజయవాడలోని వరద బాధితులకు వేన్ ద్వారా పంపించారు. రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో ఏపీఐఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఈ వాహనాన్ని పంపించారు. అసోసియేషన్ కార్యదర్శి కోలా జగదీష్, చేకూరి రామలింగరాజు, చిక్కం భాస్కరరావు, గుత్తుల వీర్రాజు, జి జగదీష్, రెడ్నం విష్ణులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉల్లి, బంగాళదుంపలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 9: కాకినాడ రైతు బజార్ నుంచి పిఠాపురం పరిసర ప్రాంత వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెయ్యి కిలోల ఉల్లిపాయలు, వెయ్యి కిలోల బంగాళదుంపలు పంపిస్తున్నట్టు ఆర్టీసీ డిపో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ గోవిందరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కరప, సెప్టెంబరు 9: సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలను సేకరిస్తున్నట్టు అంగన్‌వాడీ వర్కర్లు తెలిపారు. కరపలో సోమవారం వారు వరద బాధితుల సహాయనిధి పేరుతో దాతల నుంచి విరాళాలను సేకరించి ఈ మొత్తాన్ని మంగళవారం జిల్లా కమిటీకి అందజేస్తామని తెలిపారు. అంగన్‌వాడీలు శ్రీపాదం వరలక్ష్మి, హైమావతి, సత్యసాయిరామదుర్గలక్ష్మి పాల్గొన్నారు.

సెట్రాజ్ సీఈవోగా కాశీవిశ్వేశ్వరరావు



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 9: జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మేనేజర్‌గా ఉన్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. సోమవారం రమణయ్యపేట సెట్రాజ్ కార్యాలయంలో సీఈవోగా కాశీ విశ్వేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి సీఈవోగా పని చేశారు. నూతన సీఈవోకు సహచర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాకినాడ అదనపు కమిషనర్‌గా సుధాకర్ బాధ్యతలు



కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబర్ 9: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కేటీ సుధాకర్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టనున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న ఆయన కాకినాడ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, అకౌంట్స్ సెక్షన్ అధికారి సిరీస్ ఇతర అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

14న జాబ్ మేళా

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 9: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర (పీఎంకేకే) సెంటర్, వీఎస్ఎల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల 14న సర్పవరం జంక్షన్‌లో హీరో మోటోకార్ప్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ బి.వంశీ తెలిపారు. ఈ మేళాకు హీరో మోటోకార్ప్, డైకిన్, నియోలింక్, వింగ్‌టెక్, ఇన్‌ప్లాం వంటి ప్రముఖ కంపెనీలు వస్తున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్హతల కల యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలకు అసెంబ్లింగ్, మెషీన్, ప్రొడక్షన్, క్వాలిటీ ఆపరేటర్ పోస్టుల భర్తీ చేయనున్నామని, ఈ పోస్టులకు రూ.14 వేలు నుంచి 21 వేలు జీతంతో తడలో శ్రీసిటీ, రేణిగుంట, మాంబట్టు ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9666562358, 9985034555 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

16న అరుణాచలం యాత్ర స్పెషల్ బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 9: కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 16న అరుణాచలానికి స్పెషల్ బస్సు నడుపబడుతున్నట్టు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. 16న మధ్యాహ్నం 1గంటకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం వెళ్లి అక్కడ గిరిప్రదక్షిన పూర్తయిన తర్వాత పెద్దకంచి, శ్రీకాళహస్తి దర్శనం చేసుకుంటారు. 19వ తేదీ రాత్రి 10గంటలకు కాకినాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలదని,ధర రూ.3100 నిర్ణయించడమైందన్నారు. బుకింగ్ కొరకు 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.


పెద్దాపురంలో వంతెన కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ


సామర్లకోట మండలం వీకేరాయవరం వద్ద ఏలేరు జలాల వరద పరిస్థితి

పెద్దాపురం, సెప్టెంబరు 9: పెద్దాపురం మండల పరిధిలోని కాండ్రకోటలో దబ్బకాలువపై వరద ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెనను ప్రదేశాన్ని రాహుల్ మీనా సోమవారం పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. వంతెన లేకపోవడం కారణంగా వచ్చే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వంతెన కొట్టుకుపోవడం కారణంగా కట్టమూరు, జె.తిమ్మాపురం, తూర్పుపాకలు గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉండదని జేసీకి రైతులు వివరించారు. అయన మాట్లాడుతూ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. ఉధృతి మరింతగా పెరిగే అవకాశం ఉందని రైతులు, ప్రజలు కాలువ వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నప్రాంతాల్లో వాటని పటిష్ఠపరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొన్నారు. ఏలేరు వరద ఉధృతి కారణంగా పాత పెద్దాపురంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరిపంట నీటమునిగినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఏలేరు ఎడమ కాలువకు గండి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: ఏలేశ్వరం ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ఏలేరు ఎడమ కాలువకు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామ సమీపంలో సోమవారం గండి పడింది. పెద్దిపాలెం వినాయక గుడి ఎదురుగా అవతల గట్టుకు ఈ గండి పడడంతో ఏలేరు ఎడమ కాలువ నీరు పక్కదారి పట్టింది. ఏలేరు ఎడమ కాలువ నిర్వహణ అధికారులు అప్రమత్తమై గండిపూడ్చివేత చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలతో ఈ గండిని సోమవారం సాయంత్రానికి పూడ్చివేశారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబులతోపాటు అధికారుల బృందం పరిశీలించింది. పెద్దిపాలెం నుంచి చింతలూరు వరకు ఏలేరు గట్టు పటిష్టతపై అధికారులు పరిశీలన చేశారు.

బియ్యం, నిత్యావసరాలు బోటులో తరలింపు

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: సుద్దగడ్డ వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీవాసులకు సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు 25కిలోల బియ్యం, ఒక కిలో వంతున కందిపప్పు, పంచదార, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందజేశారు. వీటిని బోటులో జగనన్న కాలనీకి విడతల వారీగా తరలించారు. కార్యక్రమాన్ని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ పర్యవేక్షించారు.

వరద నీటితో అవస్థలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 9: పట్టణ శివారులో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చైతన్యనగర్, అంబేద్కర్‌కాలనీలో వర్షపు నీరు ఇళ్ల మధ్యలోకి చేరడంతో సోమవారం వరద నీటితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

సామర్లకోటను చుట్టిముట్టిన ఏలేరు జలాలు

సామర్లకోట, సెప్టెంబరు 9: ఏలేరు మిగులు జలాలను కిందికి విడుదల చేస్తుండడంతో సామర్లకోట మండ లాన్ని చుట్టిముట్టడంతో సోమవారం మధ్యాహ్నంనుంచి సామర్లకోట పట్టణానికి, మండలంలోని వీకే రాయపురం గ్రామాలకు వరదనీరు తీవ్రంగా తాకింది. ఒకదశలో వీకే రాయపురం జడ్పీ ఉన్నత పాఠశాలవద్ద ఏలేరు కాలువకు గండిపడే ప్రమాద పరిస్థితి నెలకొంది. సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో డి.శ్రీలలిత, ఇరిగేషన్ అధికారులు, స్థానిక నేతలు ఏలేరు గట్టు వద్దకు చేరుకుని గ్రామస్తులను అప్రమత్తం చేశారు. గండిపూడ్చేందుకు అవసరమయ్యే కర్రలు, ఇసుక బస్తాలు, మట్టి గట్టు వద్దకు చేర్చారు. ఏలేరు కాలువ ప్రమాదస్థాయిని మించి జలాలు ప్రవహించడంతో ఏలేరులో ఉన్న కాజ్‌వే పూర్తిగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ఏలేరు కాలువ అవతలి గట్టున ఉన్న వ్యవసాయాధారిత ఉత్పత్తులను ఇవతలి గట్టుకు చేర్చేందుకు మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి. ఏలేరు జలాల కారణంగా గయ్యాలి పుంత పొంగి ప్రవహించడం కారణంగా వీకే రాయపురం, బోయినపూడి, మాధవపట్నం గ్రామాల పరిధిలో 800 ఎకరాల వరిపంట నీటిముంపులోకి చేరింది. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల వద్దకు ఏలేరు జలాలు చేరడంతో టిడ్కో గృహాలకు ముంపు బెడద ఏర్పడింది.

నాగులాపల్లిలో ముందు జాగ్రత్త చర్యలు

కొత్తపల్లి, సెప్టెంబరు 9: ఏలేరు అదనపు జలాల విడుదలతో కొత్తపల్లి మండలానికే అధిక నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నాగులాపల్లి నుంచి నేరుగా సముద్రానికి వెళ్లే పెదయేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం ఉదయానికి ఇక్కడ గండ్లు ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా నాగులాపల్లి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ఇక్కడ పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. గ్రామంలో సోమవారం ఆయన పెదయేరు ప్రాంతాల ను, సమీపంలో ఉన్న ఎస్సీపేటను పరిశీలించారు. రమణక్కపేట, కోనపాపపేట రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉండడంతో నాలుగుబోట్లను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ చిన్నారావును ఆదేశించారు.

తగ్గని ఏటికాలువ ఉధృతి

రౌతులపూడి, సెప్టెంబరు 9: రౌతులపూడిలో భారీ వర్షాలకు ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ వల్ల చింత రేవళ్లకు వెళ్లే రహదారిలో ఉధృతంగా ప్రవహించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో గట్టు ప్రమాదకరంగా ఉన్న బంగారయ్యపేట, బలరామపురం, గంగవరం, గుమ్మరేగుల గ్రామాల్లో రెవెన్యూ ఉద్యోగులు పర్యటిస్తూ అప్రమత్తంగా ఉన్నారు.

ధర్మవరం-వెల్దుర్తి వంతెన మూసివేత

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాలను కలిపే వెల్దుర్తి రహదారి సోమవారం రాత్రి నుంచి మూతపడింది. ధర్మవరం-వెల్దుర్తి గ్రామాల మధ్య ఉన్న వంతెనపై నుంచి సుద్దగడ్డ వాగు పొంగి ప్రవహించడంతో అధికారులు ఈ మార్గాన్ని మూసివేశారు. దీంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వంతెనపై ప్రవహించే నీటిలో వాహనదారులు దిగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

శంఖవరంలో అప్రమత్తం

శంఖవరం, సెప్టెంబరు 9: ఏలేరు కాల్వ ప్రవహిస్తున్న మండలంలోని గ్రామాలను తహశీల్దార్ పోతురాజు సిబ్బందితో పరిశీలించి గండ్లు ఏర్పడే ప్రమాదాలపై ఆరా తీశారు. గొంది కొత్తపల్లిలో చెరువుగట్లు వద్ద ఇసుక మూటలు ఏర్పాటు చేశారు.

ముంపు ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టరు కృష్ణతేజ పర్యటన

గొల్లప్రోలు/పిఠాపురం రూరల్/సామర్లకోట, సెప్టెంబరు 9: ఏలేరు, సుద్దగడ్డ ముంపు ప్రభావిత గ్రామాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టరు కృష్ణతేజ పర్యటించారు. పిఠాపురం మండలం మాధవపురంలో ఆదివారం అర్ధరాత్రి పర్యటించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం గొల్లప్రో లు పట్టణంలోని సూరంపేట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అధికారులతో కలిసి పరిశీలించి గొల్లప్రోలు కాలనీలకు ముంపు, రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏ విధంగా చేయాలనే అంశాలపై పరిశీలన జరిపారు. సామర్లకోట మండలం వీకేరాయపురంవద్ద ఏలేరు కాలువకు గండి పడే పరిస్థితులను పరిశీలించారు.

పొంగుతున్న సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ


ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డిసాగర్ ఏటికాలువ వద్ద పరిస్థితి


తుని-నర్సీపట్నం రహదారి ఉప్పరగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్లగడ్డ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: భారీ వర్షాలకు సోమవారం ప్రత్తిపాడు మండలంలో వాగులు, గడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. సుబ్బారెడ్డిసాగర్ ఏటికాలువ వరద ఉధృతికి పెద్దిపాలెం, వేములపాలెం గ్రామాల మధ్య వంతెనపై నుంచి ఐదు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పెద్దిపాలెం, వేములపాలెం గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ మార్గంలో ఈ రెండు గ్రామాలతోపాటు గోకవరం, రౌతుపాలెం, మెట్టిచింత, వంతాడ, గిరిజనాపురం, ఉలిగోగుల, తదితర గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి వేములపాలెం, రౌతుపాలెం, లంపకలోవ, పి.జగన్నాధపురం, రాయవరం, ప్రత్తిపాడు గ్రామాలకు చెందిన పంట పొలాలు వరదనీటి ముంపునకు గురయ్యాయి. ఈ వాగుతోపాటు సుద్దగడ్డ, పెదశంకర్లపూడి వెంకన్నదొర చెరువు, ఒమ్మంగి రాజు చెరువు, చింతలూరు రామనుజనం చెరువులు పొంగి ప్రవహిస్తుండడంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరద ముంపులో ఉన్న పెద్దిపాలెం, వేములపాలెం గ్రామాల మధ్య నూతనంగా వంతెన నిర్మించాలని ఆ గ్రామాల ప్రజలు జేసీ రాహుల్ మీనాను కోరారు. సోమవారం ఆయన పెద్దిపాలెం వచ్చి వంతెనపై పరిస్థితిని పరిశీలించారు.

తుని-నర్సీపట్నం రహదారిలో సుద్దగడ్డ ఉధృతం

కోటనందూరు, సెప్టెంబరు 9: సుద్దగడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. కాకినాడ-అనకాపల్లి సరిహద్దులో ఉప్పరగూడెం వద్ద వెదుళ్లగడ్డ ఉధృతంగా ప్రవహించడంతో తెల్లవారు జామునుంచి తుని-నర్సీపట్నం రాకపోకలు అంతరాయం ఏర్పడింది. తాండవ రిజర్వాయర్ నీటిని విడుదల చేయడంతో కోటనందూరు, రౌతులపూడి, మూలగపూడి, కోట్నాం, కత్తిపూడి గ్రామాలకు రాకపోవకలకు అంతారాయం ఏర్పడింది. తుని సీఐ చెన్నాకేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణ, తహశీల్దార్ సుభాష్ వాగులకు పరిశీలించారు.

సహకార బ్యాంకులో అక్రమాలపై విచారణ

తుని రూరల్, సెప్టెంబరు 9: తుని, కోటనందూరు, తొండంగి, సహకారసంఘ బ్యాంకుల్లో గత పాలకులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ శాఖాధికారులు తుని సహకార శాఖ బ్రాంచ్‌లో సోమవారం విచారణ ప్రారంభించారు. షేర్ క్యాపిటల్ వసూళ్ళు, భూ తనకా పత్రాల రెన్యూవల్‌లో సంబంధింత పత్రాలు పరిశీలించడంతో పాటుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న శాఖలో లోన్లు పొందిన సుమారు 1100 మందికి నోటీసులు జారీ చేసి సమగ్ర విచారణ అనంతరం ఏ మేరకు అక్రమాలు జరిగాయో నిగ్గు తెలుస్తామని విచారణ అధికారి, ప్రత్తిపాడు జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ డీఎం శివకుమార్ తెలిపారు.

ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలు

తాళ్లరేవు, సెప్టెంబరు 9: పటవల పంచాయతీ పరిధి కొత్తూరు 216 జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడిందని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. యానాం నుంచి కాకినాడ వెళ్తున్న పాసింజర్ ఆటో మట్లపాలెం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు, డ్రైవర్ మాణిక్యాలరావుకు తీవ్ర గాయాలు కాగా వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోరింగ ఎస్ఐ తెలిపారు.

గర్భిణులకు అన్నదానం

శంఖవరం, సెప్టెంబరు 9: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో పరీక్షలు నిమిత్తం వచ్చిన గర్భిణులకు జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు అన్నదానం చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఆర్వీ సత్యనారాయణ, శ్రీరామ్‌రాజీవ్‌కుమార్ గర్భిణులకు పరీక్షలు చేసి తగుజాగ్రత్తలు తెలిపారు. తాతాజీ, అపురూప్, దుర్గాప్రసాద్, జాన్ తదితరులు ఉన్నారు.


ఆసుపత్రిలో అన్నదాన దృశ్యం

వరద ముంపునకు కారణం జగన్ : వర్మ


పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, సెప్టెంబరు 9: రివర్స్ టెండరింగ్ పేరుతో టీడీపీ హయాంలో మంజూరై జరుగుతున్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులను జగన్‌రెడ్డి రద్దు చేసి నేటి వరద ముంపునకు కారణమయ్యారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు ఆయా మండలాల పరిధిలోని మాధవపురం, గోకివాడ, నరసింగపురం, జములపల్లి, కోలంక, కొడవలి, చేబ్రోలు, మల్లవరం, తాటిపర్తి తదితర గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఏలేరు వరద పరిస్థితిని, ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా తీసుకువచ్చి ఆధునీకరణ పనులను పూర్తి చేసి ఉంటే నేడు ఈ ముంపు ఉండేది కాద న్నారు. ఏలేరు, సుద్దగడ్డ వరద బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

గ్రామాల్లో నెహ్రూ పరిశీలన

జగ్గంపేట, సెప్టెంబరు 9: మండలంలో ఏలేరు వరద గ్రామాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జంపన సీతారామచంద్రవర్మ, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల దొరబాబు, మంచికంటి శ్రీను పాల్గొన్నారు. ఏలేరు ముంపు ప్రాంతాలైన తామరాడ, రామచంద్రపురం, వీరవరం, రాజుపాలెం, ముక్కోల్లు, గెద్దనాపల్లి, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగారాయునిపాలెంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతులనవీన్ పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


గొల్లప్రోలులో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో

గొల్లప్రోలు, సెప్టెంబరు 9: గొల్లప్రోలు పట్టణ శివారులోని సూరంపేట, జగనన్న కాలనీ తదితర ముంపు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును, అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ముంపు ప్రభావిత 12మండలాల పరిధిలోనూ నిరంతరాయంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టామని చెప్పారు.

తొండంగి: వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం కోదాడ,కొత్తపల్లి గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ముంపునకు గురైన పొలాల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ దయాకర్, మార్టేరుకు చెందిన డాక్టర్ సుధారాణి, డాక్టర్ రమేష్ బాబు పొలాలు పరిశీలించి సూచనలు చేశారు. అలాగే పెరుమాళ్ళపురం పంచాయితీ పరిధిలో చేపట్టిన ముంపు నివారణ చర్యలు కొనసాగాయి. తహశీల్దార్ మురార్జీ ఆర్ఐ వెంకటేశ్వర్రావు, టీడీపీ నేతలు యనమల నాగేశ్వర్రావు, కొయ్యా రామకేశవ, కాలిబోయిన చంద్రరావు, చొక్కా అప్పారావు తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

గండేపల్లి: మండలంలో ఏలేరు కాలువ ప్రభావిత ప్రాంతాలు పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, పి.సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాలను ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దార్ పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గిరిజన హాస్టల్‌ని పరిశీలించిన జడ్జి

శంఖవరం, సెప్టెంబరు 9: పెదమల్లాపురం గిరిజన బాలుర వసతిగృహాన్ని ఎక్సైజ్ మెజిస్ట్రేట్ నాగమల్లీశ్వరి సోమవారం పరిశీలించారు. రాష్ట్ర హైకోర్టు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో పరిశీలనకు వచ్చినట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం గుర్తించి అందుబాటులో ఉన్న సిబ్బందితో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట అడ్వకేట్లు బుగతా శివ, అవసరాల దేవి, అన్నవరం ఎస్ఐ కిషోర్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, సెప్టెంబరు 9: ప్రత్తిపాడులో బీసీబాలిక వసతి గృహాన్ని కాకినాడ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఉషా లక్ష్మి కుమారి సోమవారం తనిఖీ చేశారు. హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలు, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. వంట మనిషికి సహాయకురాలును, స్కేవింజర్‌ను వెంటనే నియమించాలని విద్యార్థులను జడ్జిని కోరగా దీనిపై జిల్లా అధికారులకు తెలపాలని జడ్జి వార్డెన్ శైలజారాణిని ఆదేశించారు. ప్యానల్ అడ్వకేట్లు బుగతాశివ, అవసరాల దేవి, బొంగుఖూరి మధుబాబు ఉన్నారు.

నూకాలమ్మ హుండీల లెక్కింపు

పెద్దాపురం, సెప్టెంబరు 9: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ హుండీల ఆదాయాన్ని దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 93 రోజులకు రూ.7,65,921 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు చల్లా ఉదయ్‌బాబునాయుడు తదితరులున్నారు.

సచివాలయ శిలాఫలకాలు ధ్వంసం

కరప, సెప్టెంబరు 9: మండలంలోని కూరాడ గ్రామ సచివాలయ భవనం శిలాఫలకాలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై వైసీపీ నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తూ పంచాయతీ కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని కోరారు. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు.

ఏకాదశ రుద్రాభిషేకం పూజలు

పోర్టుసిటీ (కాకినాడ), సెప్టెంబరు 9: గణపతి నవరాత్రులు పురస్కరించుకుని దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయ ఆవరణలోని సంపత్ విజయ గణపతి స్వామి దేవాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం పూజలు చేశారు. కార్యాలయ పర్యవేక్షకుడు కె.నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.